క్లుప్తంగా

రెల్లి కులస్తుల సంక్షేమానికి కృషి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు
శిరంసెట్టి పూర్ణచంద్రరావు



నెహ్రూనగర్: రెల్లి కులస్తుల సంక్షేమానికి తగిన కృషి చేస్తానని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శిరంసెట్టి పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు. కొండా వెంకటప్పయ్య కాలనీలో ఆదివారం సంఘ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెల్లి కులస్తులు ఆర్థిక, సామాజిక అసమానతలకు గురై ఎన్నో కష్టాల్ని అనుభవిస్తున్నారని తెలిపారు. రెల్లి కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేసి ప్రభుత్వం దృష్టికి వారి సమస్యలు తీసుకువెళతానని చెప్పారు. కార్యక్రమంలో మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ యలమంచిలి సామ్రాజ్యం, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ చెన్నా వెంకట్రావు, నాగేంద్రబాబు, ప్రకాష్, అంజిబాబు, శ్రీనివాసరావు, సింహాచలం, రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



పాత గుంటూరు: అరండల్‌పేట శ్రీ మోహన రంగనాయకస్వామి దేవాలయంలో శ్రీ తిరుమల ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మహంకాళి సూర్యనారాయణశర్మ శిష్య బృందం కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు వైష్ణవి, లిఖిత, యజ్ఞిక, గీతిక, పర్ణి, యశస్వి, శ్రియ, పద్మ, హర్షిణి, భవ్యశ్రీ , మనోజ్ఞ, పరమ, పూజిత, భువన, నందన, మోక్షిత తదితరులు గణపతి ప్రార్థన, మానస సంచరరే, పలుకే బంగారమాయే కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమాన్ని మహంకాళి నాగలక్ష్మి పర్యవేక్షించారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం

లక్ష్మీపురం: చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించి 128వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఉభయ సభల ఆమోదం లభించడం చారిత్రాత్మకమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్లు దాదాపు మూడు దశాబ్దాలుగా ఆమోదానికి నోచుకోకుండా పడి ఉన్నారు. ఇప్పుడు అది చట్టం కావడంతో అన్ని వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాని చెప్పారు. పార్లమెంటులో మహిళలకు సమాన ప్రాతినిధ్యం లేకుండా సామాజిక అభివృద్ధిని సాధించలేమని, అందుకే రిజర్వేషన్ బిల్లు ఈ నాటి అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నుంచి ఆభరణాలు లాక్కుని పరారీ

పట్నంబజారు: వృద్ధురాలి మెడ నుంచి బంగారు ఆభరణాలు దోచుకుపోయిన సంఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణనగర్‌లో 70 సంవత్సరాల వృద్ధురాలు వరలక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉంటారు. ఈ నెల 24న తెల్లవారుజామున మోటార్ వేసేందుకు ఇంట్లోంచి బయటకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఆమె నోరు మూసేసి మెడలో బంగారు గొలుసు, నాలుగు గాజులు లాక్కుని పరారయ్యారు. కొద్దిసేపటి తరువాత ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు ఆభరణాలు కూడా చోరీకి గురైనట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరులు రూ 2లక్షల విలువ చేసే బంగారం ఎత్తుకు పోయినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

మేడికొండూరు: హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని వెలవర్తిపాడు గ్రామంలో దాయాదుల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక వర్గానికి చెందిన మన్నవ జాన్ రత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. మన్నవ పుల్లయ్య, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులో నిందితులు మన్నవ చిన్నబాబు, మన్నవ భరత్ కుమార్, మన్నవ విజయ్ కుమార్, గుడి గుంట్ల ప్రేమ్ కుమార్, మన్నవ రాకేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

లంబోదర నామ స్మరణతోనే సమస్త పాప హరణ

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



యండ్రాయిలో నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు



ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి, లాలుపురం రాము, నిమ్మకాయలను సత్కరిస్తున్న నిర్వాహకులు

పట్నంబజారు: విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సర్వ శుభాలు కలగాలని, సకల విజయాలు సిద్ధించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఆకాంక్షించారు. కేవీపీ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ కె. గురవయ్య ఆధ్వర్యంలో జరిగిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చుట్టుగుంట సెంటర్‌లో దొంతా బ్రహ్మం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు చెందిన సమస్త జగత్తును తన ఉదరంలో ఉంచుకున్న లంబోదర నామ స్మరణతోనే సమస్త పాప హరణ జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు విఘాతాలు కలగకూడదని విఘ్నేశ్వరున్ని మనసారా కోరుకున్నట్లు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ కళలకు, శాస్త్రాలకు అధిపతి వినాయకుడని, బుద్ధికి జ్ఞానానికి ఆరాధ్యుడు ఆది గణపతని, ఆయన్ను మంచి మనసుతో ఆరాధించి తలపెట్టే పనులు నిర్విఘ్నంగా జరుగుతాయని తెలిపారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ గణనాథుడి ఆశీర్వాద బలంతో అటు ప్రజలు, ఇటు గుంటూరు నగరం మరింత అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, డైరెక్టర్ నాగేశ్వరరావు, కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకట రెడ్డి, గేదెల రమేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి మండలం ఎండ్రాయిలో ఏర్పాటు చేసిన వినాయకుని చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గుంటూరు శ్రీనగర్‌కు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణుల బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకుంది. గ్రామ పెద్దలు, విగ్రహ కమిటీ సభ్యుల సహకారంతో వినాయకునికి నృత్యాలతో నీరాజనం సమర్పించారు. హర హర శంభో, కళింగ నాట్యం, శ్రీనివాస, సీతారాముల, శ్రీమంజునాథ కల్యాణాల్ని ప్రదర్శించిన తీరుతో గ్రామస్తులు భక్తి పారవశ్యంలో మునితేలారు. నాట్య గురువు అను శేఖర్ పర్యవేక్షణలో 20 మంది నృత్యకారిణులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఎమ్మెల్యే గిరి ప్రత్యేక పూజలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకలు, అన్నదానాల్లో పాల్గొన్నారు. ముత్యాలరెడ్డినగర్, కొరిటెపాడు, నెహ్రూనగర్, అమరావతి రోడ్డు, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లోని చవితి పందిళ్లలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ దేవుడి పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి ఆయన ఆశీర్వాదం ప్రతి ఒక్కరూ పొందాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు యక్కలూరి మారుతి, కోటిలింగారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రవీంద్ర, అంబేడ్కర్, ప్రేమ్, వెంకటేశ్వర్లు నాయక్, శివనాగు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట 6వ లైనులో గుంటూరు విఘ్నేశ్వర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17వ వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సరస్వతీదేవి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ 150 మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పండుగలు సంప్రదాయాలకు ప్రతిరూపాలని, వాటిలోని అంతరార్థాన్ని, విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని పిల్లలకు అందించడమేనని తెలిపారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ సభ్యులు సుభాని, ఉదయ్‌రెడ్డి, నాగరాజు, చైతన్య, రాజశేఖర్, సురేష్, లీలా సాయి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనాలు

పాత గుంటూరు: ఒకటో డివిజన్‌లోని వైఎస్సార్ మున్సిపల్ పార్కు వద్ద గణేష్ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం వినాయకునికి విశేష పూజలు అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమాల్ని కార్పొరేటర్ కామిరెడ్డి రంగారెడ్డి నిర్వహించారు. నాలుగో డివిజన్‌లోని వినోభానగర్‌లో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల్లో కార్పొరేటర్ షేక్ మహమూద్ పాల్గొన్నారు.

మల్లారెడ్డినగర్‌లో నిమజ్జనోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ టెంపుల్ వద్ద ఉన్న శ్రీసీతారామ్ ఒలింపిక్ టవర్స్‌లో నిమజ్జనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అధ్యక్షుడు హజారు భవాని, కార్యదర్శి సీహెచ్. రవికుమార్, కె. కైలాష్ నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి ఏడు రోజులపాటు పూజలు నిర్వహించిన అపార్ట్‌మెంట్ వాసులు బొజ్జ గణపయ్యను నిమజ్జనోత్సవానికి తీసుకెళ్లారు.



ఇస్కాన్ టెంపుల్ వద్ద ఉన్న శ్రీ సీతారామ్ ఒలింపిక్ టవర్స్‌లో వినాయకుని విగ్రహం వద్ద మహిళలు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న విష్ణువర్ధన్



ఒకటో డివిజన్‌లో జరిగిన గణేశుని పూజల్లో పాల్గొన్న భక్తులు



అన్నదానం చేస్తున్న రంగారెడ్డి

గ్రంథాలయ వ్యవస్థలో కొత్త ప్రణాళికలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్
మందపాటి శేషగిరిరావు



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రభాకర్, శేషగిరిరావు తదితరులు

పాత గుంటూరు: కవులు, రచయితల్నే కాదు విద్యార్థుల్ని, వారి తల్లిదండ్రుల్ని కూడా గ్రంథాలయానికి రప్పించేందుకు కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. బ్రాడీపేట ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు రమణ బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కవి మిత్రుల సంగమం–కవి సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ రమణ యశస్వి అధ్యక్షత వహించారు. శేషగిరిరావు మాట్లాడుతూ సమాజాన్ని వినూత్న కోణంలో చూసే కవులు, రచయితలతో నిర్వహించే సభల్లో మమేకం కావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. అనంతరం కోట లీలాకృష్ణ రచించిన 'బ్రతుకు బాణీలు' నానీల పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డీ, సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ ఆవిష్కరించారు. తొలి పుస్తకంగా నానీలను ప్రచురించిన లీలాకృష్ణను అభినందించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ కొత్త కవుల్ని ప్రోత్సహించి, సమాజంలో వారికొక ఉన్నత స్థానాన్ని కల్పించాలనే గొప్ప లక్ష్యంతో ప్రతీ నెలా కవిమిత్రుల సంగమం– కవి సమ్మేళనం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నానీల పుస్తకాన్ని కవి కాకరపర్తి సుబ్రహ్మణ్యం సమీక్షించారు. అనంతరం సయ్యద్ జానీ బాషా నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆళ్ల నాగేశ్వరరావు, కారంచేటి విజయ్ కుమార్, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, డాక్టర్ బలరామ్ పెరుగుపల్లి, పింగళి భాగ్యలక్ష్మి, చల్లా సత్యవతి, సొపాటి ప్రభాకర్, గడల శివప్రసాద్, వెదుళ్లపల్లి సాంబశివరావు, మెరుమూరి శేషాచారి, నెమ్మాని సీతారామమూర్తి, మండే సుబ్రహ్మణ్యం, షేక్ రహీం సాహెబ్, ఆక్సి పాల్గొని కవితల్ని వినిపించారు.

'లయన్స్' సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



ఉషాకుమారిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

పాత గుంటూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అధ్యక్షుడు గౌరీశంకర్ తెలిపారు. రింగు రోడ్డులోని జేకేసీ కళాశాలలో ఆదివారం క్లబ్ సమావేశం నిర్వహించారు. సభకు గౌరీశంకర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. క్లబ్‌కు శాశ్వత పాలీ సర్వీస్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న క్లబ్ సభ్యురాలు ఎస్.ఉష కుమారిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ నూతలపాటి వీరప్రకాశరావు, లయన్ పి.గోపీచంద్, ఉగ్గిరాల సీతారామయ్య, వి.వి.సుబ్బయ్య, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ సాయిశంకర్, క్లబ్ సెక్రటరీ మూర్తి, ఈదుర వెంకటేశ్వర్లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దేశ పునర్నిర్మాణంలో యువత భాగస్వామ్యం అవసరం



స్వీపర్‌కు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ పునర్నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ సూచించారు. పట్టాభిపురంలోని కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథక (ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ విద్యతో పాటు సేవాగుణం, నాయకత్వ లక్షణాలు, మానవీయ విలువలు, దేశభక్తి వంటి అంశాలు ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులకు అలవడతాయని తెలిపారు. అనంతరం కళాశాలలో పని చేస్తున్న స్వీపర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.వి. సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయశైలజ, ఆర్. స్వామి, కత్తి శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్న మాస్టారు విద్యా, సామాజిక సేవలు అభినందనీయం

ఏఎన్‌యూ వీసీ పి. రాజశేఖర్



కన్న మాస్టారు దంపతులను సత్కరిస్తున్న ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: కన్న మాస్టారు విద్యా, సామాజిక సేవలు అభినందనీయమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఏఎన్‌యూ పాలకమండలి సభ్యునిగా నియమితులైన కన్న మాస్టారును ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు నేతృత్వంలో నగరంలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘాలు, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా ఆదివారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో సత్కరించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగాన్ని వదులుకుని నాలుగున్నర దశాబ్దాలుగా గుంటూరు నగరంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న కన్నా మాస్టారును విద్యా, గుణ సంపన్నుడిగా కీర్తించవచ్చునని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంలో ఏఎన్‌యూ ప్రస్తుత ఏడాది అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నట్లు చెప్పారు. ఐదు దశాబ్దాల వర్సిటీ అభివృద్ధిలో ఎందరో లబ్ధ ప్రతిష్టులైన వీసీలు, పాలకమండలి సభ్యుల్లో కన్నా మాస్టారు వంటి విద్యావంతులు ఉండటం వల్లనే ఇది సాధ్యమైందని చెప్పారు. విద్యాపరంగా ఆయన విశేష అనుభవం, దార్శనికత ఎన్‌యూ అభివృద్ధికి దోహదపడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కన్నా మాస్టరులోని నిజాయతీ, విద్యార్థులపై అంకితభావం, రాజకీయాలకతీతంగా మసులుకునే స్నేహ స్వభావం తమలాంటి వారికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా కన్నా మాస్టారు, రాజేశ్వరీదేవి దంపతుల్ని ఘనంగా పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిద్ధయ్య, దూరవిద్య విభాగ డైరెక్టర్ డా క్టర్ నాగరాజు, డాక్టర్ వసంతరావు, డాక్టర్ కె.చంద్రశేఖరరావు, కాటూరి వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, అపుస్మ, అప్స, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదార్ల సంఘాలకు ప్రభుత్వ ప్రోత్సాహం

తెనాలి: దేశంలో పది వేల రైతు ఉత్పత్తిదార్ల సంఘాలను ప్రోత్సహించాలన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా బీకేఎస్ జాతీయ కార్యవర్గసభ్యుడు జె.కుమారస్వామి చెప్పారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని స్వచ్ఛ ఆహార రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలోని కలెక్షన్ సెంటర్, కిసాన్ బజార్‌లో ఆదివారం బలరామ జయంతి/ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి కుమారస్వామి మాట్లాడుతూ, రైతులు తాము పండించే పంటను నేరుగా అమ్ముకోకుండా ప్రాసెసింగ్ చేసి విక్రయిస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల కోసం 35 శాతం సబ్సిడీతో 50 పైసల వడ్డీతో ప్రభుత్వం రూ.10 లక్షల వరకు రుణాలను సమకూరుస్తోందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా రైతులు సంఘటితమైతే అన్ని రకాల ప్రోత్సాహకాలు లభిస్తాయని వివరించారు. ఇదే సభలో అభ్యుదయ రైతులు డి.రంగారావు, డి.వెంకట్రావును ఘనంగా సత్కరించారు. రైతుసంఘం సభ్యుడు మీసాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా అక్కినేని శత జయంతి వేడుకలు



ప్రముఖులను సత్కరించిన రంగారావు

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అక్కినేని, ఎన్‌టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఆర్ సెంటినరీ పురస్కారాలను సినీ దర్శకుడు బి. గోపాల్, నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, నటి జయలలిత, ఆకునూరి శారద, మిట్టపల్లి మోహన్, డాక్టర్ నిమ్మల శేషయ్య, సుశీల్ కుమార్, విజయలక్ష్మి, ఎం. రాములకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గాయకులు అక్కినేని స్వర గానామృతంలో ఆయన చిత్రాల్లోని పాటలను ఆలపించి అలరించారు.

ప్రజల్లో శాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజల్లో శాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేయాల్సిన అవసరముందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాద్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు టి. జాన్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా అశాస్త్రీయ భావజాలం ప్రచారం జరుగుతోందని, దీనిని ఖండిస్తూ శాస్త్రీయ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్ మాట్లాడుతూ గుర్రం జాషువా, మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జేవీవీ నాయకులు జి. వెంకట్రావు, బి. శంకర్‌సింగ్, ఎస్‌ఎం. సుభాని, నటరాజ్, ఎం. ఉదయ్‌భాస్కర్, బి. ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

చలపతి కళాశాలలో ముగిసిన శిక్షణ శిబిరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు రూరల్: విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యతలు ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. ఐదు రోజులుగా నగర శివారులోని లాం కళాశాలలో జరుగుతున్న మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై శిక్షణ సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్, మోడల్ బిల్డింగ్, డేటా అనాలసిస్, డేటా సెట్, యాపింగ్ తదితర అంశాలను వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సుజిత్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను మెరుగు పరచవచ్చని తెలిపారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇంటర్‌నెట్ సహాయంతో ఏవిధంగా భద్రపరుచుకోవాలో తెలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీల్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భార్గవ్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండాలి

కేఎల్‌యూ డీన్ డాక్టర్ హనుమంతరావు



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి

తాడేపల్లిరూరల్: విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండాలని కేఎల్‌యూ స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు పేర్కొన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 1969లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం ద్వారా దేశ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డీన్ అడ్వయిజర్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య, ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ, పి.సురేష్, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గణపతి లడ్డూ రూ.1.70 లక్షలు





అలంకరణలో స్వామి (ఇన్‌సెట్) లడ్డూను దక్కించుకున్న గోపిరెడ్డి

గుంటూరు రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నల్లపాడు గ్రామంలోని శ్రీ అంకమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో 30వ గణేష్ మహోత్సవాల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా స్వామి వద్ద పూజలు అందుకున్న లడ్డూ వేలంపాటను నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తుడు కొటు గోపిరెడ్డి రూ.1.70 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం లడ్డూను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. కార్యక్రమంలో అంకమ్మతల్లి యూత్, గ్రామస్తులు పాల్గొన్నారు.